క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి

ఎస్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు గాంగ్యనాయక్

అనంతగిరి: ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వికారాబాద్‌లోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట సమ్మె బుధవారం కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంగ్యనాయక్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలన్నారు. శాంతియుతంగా సమ్మె నిర్వహిస్తున్నట్లు, వెంటనే ప్రభుత్వం చర్చలకు పిలవాలని కోరారు. అనంతరం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సమ్మె గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. ఈ సమ్మెకు టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం సంపూర్ణ మద్దతు తెలిపారు.

విహార యాత్రలతో విజ్ఞానం పెంచుకోవచ్చు



విహారయాత్రల్లో దిర్సంపల్లి విద్యార్థులు

దోమ: విహారయాత్రలకు వెళ్లడం వల్ల విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని ఉపాధ్యాయులు పరిపూర్ణ, నారాయణ, సతీశ్ కుమార్, గోపాల్, శేఖరయ్య, వెంకటదాస్ పేర్కొన్నారు. బుధవారం దోమ మండల పరిధిలోని దిర్సంపల్లి పాఠశాల నుంచి విద్యార్థులను విహార యాత్రలకు వారు తీసుకెళ్లారు. అక్కడ పలు దేవాలయాలు, మ్యూజియం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన మండల నాయకులు



మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో మండల నాయకులు

షాబాద్: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని మండల బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశారు. లగచర్ల ఘటనలో పెట్టిన అక్రమ కేసుల్లో జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చిన నరేందర్‌రెడ్డిని బుధవారం నగరంలోని ఆయన నివాసంలో మండల పరిధిలోని సంకెపల్లిగూడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుమ్మరి దర్శన్, నాయకులు కాల్వ జగదీశ్‌రెడ్డి, మామిడి సత్యనారాయణ రెడ్డి, మామిడి వెంకట్‌రెడ్డి, కుమ్మరి మహేందర్, తదితరులు ఉన్నారు.

రెడ్డి సేవా సమితి కేలండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి

షాద్‌నగర్: పట్టణంలోని రెడ్డి సేవా భవనంలో బుధవారం షాద్‌నగర్ రెడ్డి యువజన సేవా సమితి నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెడ్డి కులస్తులందరూ ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు గుండుబాయి శ్రీనివాస్‌రెడ్డి, నరేశ్‌రెడ్డి, ఆశన్నగారి మధుకర్‌రెడ్డి, చౌలపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, బసిరెడ్డి అజయ్‌రెడ్డి, యాదిరెడ్డి, మహేందర్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, పబ్బతి మధుసూదన్ రెడ్డి, సతీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళాశాల నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్: పట్టణంలో దాతల సహకారంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మున్సిపాలిటీ పరిధిలోని చటాన్‌పల్లి గ్రామానికి చెందిన నందారం అశోక్‌యాదవ్ బుధవారం విరాళం అందజేసి సేవా గుణాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల నిర్మాణం చేపడుతున్న స్థలంలో నందారం అశోక్‌యాదవ్ ఎమ్మెల్యేకు రూ.10లక్షల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా అశోక్‌ను ఎమ్మెల్యే శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు చెంది తిరుపతిరెడ్డి, బాలాజీ, మహేశ్, సంతోష్, నక్కల శ్రీకాంత్‌గౌడ్, శివ, శ్రీరాం, హరీశ్, మహేశ్, నర్సింలు, రమేశ్, చెన్నయ్య, లింగారెడ్డి గూడ అశోక్, నందిగామ శంకర్, భగవాన్ దాస్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

మారని బతుకులు!



ఆలేడ్ సమీపంలో ఓ రైతు పొలంలో వలతో ఏర్పాటు చేసిన ప్రహరీలో ఉంచిన గొర్రెలు

- జీవాల మేత కోసం వందల కిలో మీటర్ల వరకూ నడక
- నెలల తరబడి ఇంటిని వదిలి ఉంటున్న కాపరులు
- తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు

ఇంటిని, కుటుంబాన్ని వదిలి రెండు, మూడు రోజులు ఇతర ప్రాంతాలకు వెళ్లామంటేనే ఇంటివైపు మనస్సు గుంజుది. గొర్ల కాపరులు మేత కోసం కొన్ని నెలల తరబడి వలసలు వెళ్తుంటారు. ఒక గ్రామానికి చెందిన కొంత మంది గొర్రెల పెంపకం దారులు గ్రూపుగా ఏర్పడి జీవాల మేత కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. అందులో భాగంగానే నారాయణపేట్ జిల్లా జాజాపూర్, కుల్కచెర్ల మండల గాడ్దిర్యాల నుంచి దుద్యాల్ ప్రాంతానికి మేత కోసం వలస వచ్చారు. ఈ సందర్భంగా వారితో సాక్షి ముచ్చటించింది.



వంట వండుకుంటున్న గొర్ల కాపరులు

దుద్యాల్: నాలుగు కుటుంబాలకు చెందిన గొర్రెల పెంపక దారులు దాదాపు వెయ్యి జీవాలను ఒక గ్రూపుగా ఏర్పాటు చేసుకొని, ఇక్కడ వర్షాకాలంలో మేత అందుబాటులో ఉంటుంది. అనంతరం వలస బాటేనన్నారు. మేత ఏ ప్రాంతంలో దొరుకుతుందో ముందుగానే బంధువుల ద్వారా లేదా స్వయంగా పర్యటించి తెలుసుకుంటారు. ఇలా మేత ఉన్నా ప్రాంతాన్ని ఎంచుకుని అదే మార్గంలో వెళ్తుంటామన్నారు. గ్రామం నుంచి బయలుదేరే ముందు వంట సామగ్రి, పాత్రలను కూడా వెంట తెచ్చుకుంటాం. రాత్రి సమయంలో జీవాల కోసం వాటికి ప్రత్యేక వలతో ప్రహరీలా ఏర్పాటు చేస్తామని చెప్పారు. తాము జీవాల వద్దే ఉండి అక్కడే వంట చేసుకుంటాం. ఉదయం, రాత్రి వేళల్లో భోజనం వండుకుని కాలం వెళ్లదీస్తామని చెప్పుకొచ్చారు. ఒక్కోసారి పెంచుకున్న జీవాల కోసం నెలల తరబడి కుటుంబాలకు దూరంగా ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాలకు వెళ్లినప్పుడు అక్కడి రైతులు వారివారి పొలాల్లో రాత్రి వేళల్లో జీవాలను కట్టేయాలని కోరుతారు. దీని వల్ల వాటి మల విసర్జన భూమిలోకి ఇంకితే సేంద్రియ ఎరువుగా మారి పంటల దిగుబడికి ఆస్కారం ఉంటుందని వారి భావన. దీంతో వారు వంట వండుకోవడానికి బియ్యం, కూరగాయలు ఇస్తారని చెబుతున్నారు. మేత కోసం ఏకంగా వందల కిలో మీటర్లు నడుచుకుంటూ వెళ్లాల్సి ఉంటుందని చెబుతున్నారు. కొన్ని సందర్భాలలో కొంత మంది రైతులు తమ పొలంలో మేత ఎందుకు మేపుతున్నారని బెదిరించి, కొట్టిన సందర్భాలు కూడా ఉన్నాయని గుర్తు చేసుకున్నారు. తాము వాన, చలి, ఎండకు తట్టుకుని జీవన పోరాటం సాగిస్తున్నమని గొర్రెల కాపరులు వాపోతున్నారు. ఈ విషయంలో తమను ఏ అధికారి కూడా పట్టించుకోవడం లేదు.

> **ఒకప్రాంతంనుంచి ఇంకో ప్రాంతానికి..**
>
> 
>
> జీవాలను మేత కోసం మా గ్రామం వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్తుంటాము. నిత్యం వంట వండుకుని, జీవాల మేత కోసం తిరగడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. మేతకోసం ఒకప్రాంతం నుంచి ఇంకో ప్రాంతానికి వెళ్లక తప్పదు. గొర్రెలు, మేకలు మేత మేసే సమయంలో కొంత మంది రైతులు మేపమంటారు. మరికొంత మంది తమతమ పొలాల్లో వద్దని బెదిరిస్తారు.
>
> – హన్మంతు, గొర్రెల కాపరి, గాడ్దిర్యాల

మున్నూరు కాపులు రాణించాలి

సంఘం తాలుకా అధ్యక్షుడు చంద్రశేఖర్



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన సభ్యులు

కొడంగల్: మున్నూరు కాపులు అన్ని రంగాల్లో రాణించాలని నియోజకవర్గ అధ్యక్షుడు బాకారం చంద్రశేఖర్ పేర్కొన్నారు. కొడంగల్ తాలుకా మున్నూరు కాపు నూతన కార్యవర్గాన్ని మంగళవారం రాత్రి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాకారం చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా బి.మల్లయ్య, కోశాధికారిగా కానుకుర్తి నర్సిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కానుకుర్తి రమేశ్, అరిగె ఓంప్రకాశ్, గంగపొళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఈజీపురం వెంకటయ్య, కార్యదర్శులుగా కన్నం శ్రీనివాస్‌రెడ్డి, తూం వెంకటయ్య, బొంకురు కృష్ణ, గందె వీరేశం, మీడియా ఇంచార్జిగా అరిగె అనంతప్రసాద్, బొంకురు నరేశ్ కుమార్, మాసుల శశివర్ధన్, ప్రచార కార్యదర్శులుగా మున్నూరు బిచ్చప్ప, సిరుసని శ్యాంసుందర్, ముఖ్య సలహాదారుడిగా బొంకురు శంకరప్ప, మరో 20 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బాకారం చంద్రశేఖర్ మాట్లాడుతూ మున్నూరు కాపు కుల బంధువులు ఐక్యంగా ఉండాలని కోరారు.

మున్సిపాలిటీ వద్దు.. పంచాయతే ముద్దు

- మున్సిపాలిటీ ఏర్పాటుపై ప్రభుత్వం ఆలోచించాలి
- బీఆర్ఎస్ మండల నాయకుడు కుమ్మరి రాము



ఎన్కెపల్లి గ్రామ పంచాయతీ ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న మున్సిపాలిటీల ఏర్పాటులో గ్రామాల స్థాయిలో అభిప్రాయాలు సేకరించి నిర్ణయం తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కుమ్మరి రాము పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎన్కెపల్లి గ్రామ పంచాయతీ ఎదుట గల అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎన్కెపల్లి, జీవన్‌గూడ గ్రామస్తులతో కలిసి మున్సిపాలిటీ వద్దు.. గ్రామ పంచాయతీ ముద్దు.. అనే పేరుతో ఆయన నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలు గాలికి వదిలి 111 జీవోలో ఉన్న మొయినాబాద్ మండలాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన విమర్శించారు. ప్రజల అభిప్రాయం లేకుండానే ఏకాభిప్రాయంగా సూచించడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ముందుగా 111 జీవోను తొలగించి మున్సిపాలిటీ జోలికి రావాలన్నారు. అభిప్రాయాల సేకరణలో గ్రామాల ప్రజలను ఇబ్బందులు పెట్టొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కుమ్మరి రాము, పెండ్యాల శ్రీనివాస్, సురేశ్, ప్రభాకర్, రమేశ్, మల్లేశ్, రవీందర్, చంద్రబోస్‌గౌడ్, కృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కేశంపేట: మండల పరిధిలోని వేములనర్వ గ్రామ శివారులోని నంబయ్యగుట్టపై గల వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా జరిపించారు. మంజుల మల్లేశ్, అనురాధ పర్వత్‌రెడ్డి దంపతులు కల్యాణంలో పాల్గొని పూజలు చేశారు. కల్యాణం అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎల్గనమోని రవీందర్‌యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణగౌడ్, సురేశ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కరుణాకర్, మనోహర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సిరిగిరిపేట్‌లో నవగ్రహాల ప్రతిష్ఠ



తాండూరు రూరల్: మండల పరిధిలోని సిరిగిరిపేట్‌లోని శివాలయం వద్ద బుధవారం నవగ్రహాల దేవతామూర్తులను ప్రతిష్ఠించారు. గ్రామస్తులు ఆలయం వద్ద హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజారుల మంత్రోచ్ఛరణాల మధ్య నవగ్రహాలను ప్రతిష్ఠించారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తల్లి ప్రమోదిని, బీఆర్ఎస్ నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు శకుంతల తదితరులు పూజలో పాల్గొన్నారు.

◆ కొనసాగుతున్న తుల్జాభవానీమాత ఉత్సవాలు

ధారూరు: నాగారం గ్రామంలో తుల్జాభవానీ మాత ఉత్సవాలు కొనసాగుతున్నాయి.
బుధవారం ఉదయం 11 గంటలకు గ్రామదేవత పోచమ్మ, హరిజన వాడలోని పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు నరోత్తమ్‌రెడ్డి, గ్రామ పెద్దలు వీరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ పాత పోలీస్‌స్టేషన్ స్థానంలో నిర్మించాలి

కొడంగల్ రూరల్: పట్టణంలోని పాత పోలీస్‌స్టేషన్ స్థానంలో నూతన పోలీస్‌స్టేషన్ నిర్మించేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బి గుల్షన్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

మహాజాతర సభను విజయవంతం చేయండి

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబయ్య

షాద్‌నగర్: సమాభివృద్ధికి పాటుపాడిన మహనీయుడు కిషన్ ముదిరాజ్ అని, ఆయన వర్ధంతి సందర్భంగా నిర్వహించే మహాజాతర సభకు ముదిరాజ్‌లు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అందె బాబయ్య కోరారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన ముదిరాజ్ మహాసభ సమావేశానికి ముఖ్య అతిథిగా అందె బాబయ్య హాజరై మాట్లాడుతూ.. కామ్రెడ్ కిషన్ పేదల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారన్నారు. ముఖ్యంగా ముదిరాజ్ సమాజాభివృద్ధికి ఎంతో పాటుపడ్డారన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యారంగాల్లో అనేక మార్పులు తీసుకొచ్చిన ఘనత కిషన్ ముదిరాజ్‌కే దక్కుతుందన్నారు. మెదక్ జిల్లా పోలంపల్లి గ్రామంలో ఈ నెల 26వ తేదీ గురువారం నిర్వహించే ముదిరాజ్ మహాజాతర సభకు ముదిరాజ్ కులస్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మానపాటి ప్రదీప్‌కుమార్, నాయకులు అంచ రాములు, భూపాల్, కానుగు అంతయ్య, బాల్‌రాజ్, ఏపీయం శ్రీధర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాబయ్య



అనంతగిరి: విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలు మరువలేనివి

వికారాబాద్, తాండూరులో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా కొందరు నాయకులు పేదలకు దుప్పట్లు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రధానిగా పని చేసి దేశ ఔనత్యాన్ని పెంచిన మహనీయుడని కొనియాడారు. దేశ రాజకీయాల్లో భావితరానికి ఆదర్శనేతగా నిలిచాడని కొనియాడారు.



తాండూరు టౌన్: నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



పూడూరులో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



దౌల్తాబాద్: వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఘనంగా మహా పడిపూజ



తాండూరు టౌన్: పడి పూజలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తదితరులు



అనంతగిరి: వికారాబాద్ శివారెడ్డిపేటలో అయ్యప్ప స్వామి ఆభరణాల ఊరేగింపు

తాండూరు టౌన్: పాత తాండూరులోని వేంకటేశ్వర దేవాలయంలో బుధవారం అయ్యప్ప మహా పడిపూజ వైభవంగా నిర్వహించారు. ఈ పూజకు మండలి చీఫ్‌విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి హాజరయ్యారు.

అనంతగిరి: వికారాబాద్ పట్టణం శివారెడ్డిపేటలో బుధవారం అయ్యప్పస్వామి ఆభరణాల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవం హనుమాన్ మందిరం వరకు సాగింది. అనంతరం ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవంగా పడిపూజ

షాబాద్: అయ్యప్ప నామస్మరణలతో బుధవారం మండల పరిధిలోని చందనవెళ్లి గ్రామంలో ఆధ్యాత్మిక వాతవరణాన్ని సంతరించుకుంది. చందనవెళ్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి మహాపడిపూజ నిర్వహించారు. ఎమ్మెల్యే కాలె యా దయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధు సూదన్‌రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కావలి చంద్ర శేఖర్ స్వామివారికి పూజలు చేసి ప్రసాదాలు స్వీకరించారు.



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి



పరిగి: క్రిస్మస్ వేడుకలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



కొడంగల్: తాండూరు రోడ్డులో కేక్‌కట్ చేస్తున్న క్రిస్టియన్లు



బంట్వారం: కోట్‌పల్లి చర్చిలో కేక్ కట్ చేస్తున్న తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

క్రీస్తు బోధనలు ప్రపంచానికి మార్గదర్శకం

వికారాబాద్, తాండూరు నియోజకవర్గాల్లో క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతీ చర్చిల్లో బుధవారం ప్రార్థనల అనంతరం పాస్టర్లు, బిషప్‌లు యేసు బోధనలు, సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ నాయకులు ఆయా చర్చిల్లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. పరిగి పట్టణంలోని చర్చిలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. క్రీస్తు బోధనలు ప్రపంచానికి మార్గదర్శకమని, అన్ని పండుగలను గౌరవించే సంస్కృతి తెలంగాణ ప్రభుత్వానికి ఉందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.



దౌల్తాబాద్: చంద్రకల్ ప్రార్థనలో క్రిస్టియన్లు



తాండూరు టౌన్: రాజీవ్‌కాలనీలోని నజరేతు చర్చిలో దుస్తులు పంపిణీ చేస్తున్న మహేందర్ రెడ్డి



బొంరాస్‌పేట: తుంకిమెట్లలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి, పార్టీ నాయకులకు సన్మానం



పూడూరులోని మరియాపూర్‌లో..